క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శ్రావణ శుక్రవారం భక్తులు శివ పార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ అల్లె కుమార్ తగు చర్యలు తీసుకున్నారు.

జనహిత పాదయాత్రలో మహేశ్వరం నేతలు

మహేశ్వరం: కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనహిత పాదయాత్రలో శుక్రవారం పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లతో కలిసి కాంగ్రెస్ నియోజకవర్గం నేతలు పాదయాత్ర చేపట్టారు. మీనాక్షి నటరాజన్, పీసీసీ ఛీఫ్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిలతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, మండల నాయకులు కలిసి నడిచారు.

ఫేస్ రికగ్నేషన్ నమోదు ప్రక్రియ షురూ



ఫేస్ రికగ్నేషన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: వేలి ముద్రల సమస్యతో ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారుల కోసం కొత్తగా ముఖ గుర్తింపు విధానం ద్వారా పింఛన్లు ఇవ్వనున్నట్లు జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి శ్రీరామ కాలనీలోని పింఛన్ పంపిణీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధాప్యం కారణంతో సరైన రక్త ప్రసరణ లేక చాలా మంది లబ్ధిదారులకు వేలి ముద్రలు నమోదు కాక సమస్యలు తలెత్తేవన్నారు. ఈ క్రమంలో కొన్నిసార్లు పింఛన్ గోల్‌మాల్ అయిన ఘటనలు సైతం వెలుగు చూశాయన్నారు. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నూతనంగా సెర్ప్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఫేస్ రికగ్నేషన్(ముఖ గుర్తింపు) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. లైవ్ ఎవిడెన్స్ తీసుకోవడం ద్వారా పారదర్శకంగా పంపిణీ చేసేందుకు వీలుంటుందన్నారు.

ఆరోగ్య సమస్యలకు ఔషధ వనం

కడ్తాల్: నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలకు ఔషధ వనం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రధానోపాధ్యాయుడు జంగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, సీజీఆర్ పర్యావరణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో యంగ్ ఎర్త్ లీడర్ కార్యక్రమంలో భాగంగా కిచెన్ గార్డెన్, ఫ్రూట్ గార్డెన్, జనరల్ ప్లాంటేషన్, ఇంకుడు గుంత, కంపోస్ట్ షెడ్, ఔషధ వనం పనులను సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. కిచెన్‌గార్డెన్, జనరల్ ప్లాంటేషన్ ద్వారా సహజ సిద్ధమైన కూరగాయలు, పండ్లు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. వీటితో తయారు చేసిన ఆహారాన్ని విద్యార్థులు ఆరగిస్తే.. ఆరోగ్యం వంతులుగా ఎదిగేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. అంతే కాకుండా ఈ వనంతో పాఠశాల ప్రాంగణం అందంగా కళకళలాడుతుందన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ కోఆర్డినేటర్ రజనీకాంత్, ఉపాధ్యాయులు ఇంద్రారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, భీముడు, భాగ్యలక్ష్మి, శోభ, విద్యార్థులు ఉన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లు పెంచాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మహానాడు నాయకులు

కడ్తాల్: ఎస్సీ రిజర్వేషన్లను 15 శాతం నుంచి 20 శాతానికి పెంచాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఆగస్టు 1 నుంచి ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ.. మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మహానాడు ఇచ్చిన పిలుపు మేరకు బ్లాక్ డేగా పాటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మహానాడు నాయకులు భిక్షపతి, దశరథ్, చెన్నయ్య, పాండు, జంగయ్య, యాదయ్య, రాములు, శ్రీకాంత్, జంగయ్య, శేఖర్, గిరి, రాఘవేందర్, శివ, మహేశ్, శ్రీను తదితరులు ఉన్నారు.



పెద్ద చెరువు వద్ద అలుముకున్న చీకట్లు



మంత్రాల చెరువు వద్ద..

చెరువుల వద్ద వెలుగులు కరువు

ఇబ్బంది పడుతున్న వాకర్స్, వాహనదారులు

- మరమ్మతులకు రూ.35 లక్షలు కేటాయింపు
- నిధులేం చేశారంటూ ప్రజల ఆగ్రహం

మీర్‌పేట: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెరువుల వద్ద వీధి దీపాలు పాడయ్యాయి. మూడు చెరువుల వద్ద మరమ్మతులు, నూతన లైట్ల ఏర్పాటుకు గతంలో ప్రభుత్వం రూ.35 లక్షల నిధులు కేటాయించింది. వీటికి అదనంగా తాజాగా మరో రూ.15 లక్షల నిధులు కేటాయించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు.

వాకింగ్‌కు వెళ్లాలంటే వణుకు

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు, మంత్రాల చెరువుల వద్ద ఏర్పాటు చేసిన లైట్లు పూర్తి స్థాయిలో వెలుగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మంత్రాల చెరువు కట్టపై అక్కడక్కడ లైట్లు వెలుగుతున్నప్పటికీ లోపల మాత్రం పూర్తిగా అంధకారం అలుముకుంటోంది. రాత్రి 7 దాటితే వాకింగ్ చేయలేని పరిస్థితి నెలకొందని పరిసర కాలనీలవాసులు పేర్కొన్నారు. లైట్లు లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, మహిళలు, చిన్నారులు వాకింగ్‌కు వెళ్లాలంటేనే జంకుతున్నారని వాకర్స్ తెలిపారు.

నిత్యం మరమ్మతులే..

పెద చెరువు కట్టపై గతేడాది సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశారు. కొన్ని నెలలకే లైట్లు వెలుగకపోవడంతో మున్సిపాలిటీ వారు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి వదిలేశారని స్థానిక వాకర్స్, వాహనదారులు తెలిపారు. ప్రస్తుతం కట్టపై కొన్ని రోజులుగా లైట్లు వెలగడం లేదని, దీంతో పాటు కట్టకు ఓ వైపు ఫెన్సింగ్, రేడియం సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. లైట్లు ఏర్పాటు చేసినప్పటి నుంచి మరమ్మతులే తప్ప నిరంతరంగా లైట్లు వెలిగిందే లేదని సమీప కాలనీలవాసులు తెలిపారు. ప్రభుత్వం లైట్ల ఏర్పాటుకు రూ.35లక్షల నిధులు కేటాయించిందని మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవని, కొత్త లైట్లు సైతం ఏర్పాటు చేయకుండా నిధులు ఏమయ్యాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని కార్పొరేషన్ వాసులు కోరుతున్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

మహేశ్వరం ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ



మాట్లాడుతున్న శాంతిశ్రీ

మహేశ్వరం: పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే అనారోగ్యం దరిచేరదని మహేశ్వరం ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. శుక్రవారం తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని అమీర్‌పేట్‌లో తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిశువుకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇవ్వడంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంచే అమ్మపాలు అమృతంతో సమానమన్నారు. ముర్రుపాలతో శిశువుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలు పట్టించడంతో శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు, తల్లుల ఆరోగ్యానికి ఉపయోగకరమన్నారు. తల్లులు పిల్లలకు పాలు ఇవ్వడం వలన గర్భాషయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ వంటి అనారోగ్యాలు దరి చేరకుండా ఉంటాయవన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ లక్ష్మి, ఏఎన్‌ఎం మంజుల, అంగన్‌వాడీ టీచర్స్ వరలక్ష్మి, సుగుణ, అనిత, ఆశ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి సహకరించాలి

సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీవాణి



హెచ్ఎండీఏ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: బీసీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం సహకరించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. సరూర్‌నగర్ చౌరస్తాలోని పాత రంగారెడ్డి జిల్లా కోర్టు స్థలంలో షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మించాలని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు శుక్రవారం ఆమె వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జిల్లా పాత కోర్టు భవనాన్ని ఇటీవల కూల్చివేశారని, ఈ స్థలంలో బీసీల సామాజిక గౌరవానికి, ఆర్థిక అభివృద్ధికి బీసీ కమ్యూనిటీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు.

ఇల్లు కూల్చుకున్నాక కొర్రీలు

ఎంపీడీఓకు బాధితుడి వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న లబ్ధిదారు, నాయకులు

కందుకూరు: ఇందిరమ్మ ఇల్లు బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మాణం చేపట్టినా బిల్లులు మంజూరు కావడంలేదని.. న్యాయం చేయాలంటూ సాయిరెడ్డిగూడకు చెందిన పంది శేఖర్ శుక్రవారం ఎంపీడీఓ సరితకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్.వెంకట్రామ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొర్ర రాములు మాట్లాడుతూ.. పంది అనిత పేరుతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో పాత ఇల్లు కూల్చి నిర్మాణం చేపట్టారన్నారు. ప్రస్తుతం బేస్‌మెంట్ లెవల్ పూర్తయినా బిల్లు అందలేదన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే హౌసింగ్ ఏఈ గతంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు కావడంతో బిల్లు మంజూరు కాదని చెబుతున్నారన్నారు. ప్రారంభంలోనే ఈ విషయాన్ని చెబితే ఇబ్బంది ఉండేది కాదన్నారు. ఇల్లు కూల్చుకుని నిర్మాణం చేపట్టిన తర్వాత ఈ విధంగా కొర్రీ పెడితే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. సమస్య పరిష్కరించాలని ఎంపీడీఓను కోరామన్నారు.

కోట్లు కొల్లగొట్టిన బీఆర్ఎస్



కుర్మల్‌గూడలో సమావేశమైన పార్టీ నాయకులు

సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ అధ్యక్షుడు పురుషోత్తం

బడంగ్‌పేట్: బీసీ బంధు, ఎస్టీ బంధు, ఎస్సీ బంధు, రైతు బంధు ఇలా బంధుల పేర్లు చెప్పి గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు కొల్లగొట్టిందని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు బొద్రమోని పురుషోత్తం ఆరోపించారు. శుక్రవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో ఆర్.ఝాన్సీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పురుషోత్తం మాట్లాడుతూ.. చదువుకున్న నిరుద్యోగులకు ఏటా లక్ష ఉద్యోగాలు కేటాయిస్తామని చెప్పి నిరుద్యోగులను నట్టేటా ముంచారన్నారు. రాష్ట్రంలోని అసైన్డ్ భూములను పేదలనుంచి బలవంతంగా లాక్కొని పేదలను రోడ్డుపాలు చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు చేయాలని కోరారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరి మద్దతు లేకుండా సోషలిస్ట్ పార్టీ బరిలో ఉంటుందన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని 10వ వార్డులోని కార్పొరేటర్ రోహిణి నిజాయతీగా ప్రజలకు సేవ చేశారని ఆయనకు తమ పార్టీ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రమ్మ, సుజాత, జి.కృష్ణ, సీహెచ్.రాజు, భానుప్రసాద్, నాగమణి, అరుణ, జగదంబ, జ్యోతి, సురేశ్, శ్రీలత తదితరులు ఉన్నారు.

భూ సర్వే చేయకుండా ఫెన్సింగ్

ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆశ్రయించిన దెబ్బడగూడ రైతులు



కందుకూరు: ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన నాయకులు

కందుకూరు: ఫార్మాసిటీ భూ సేకరణలో భాగంగా దెబ్బడగూడ రైతుల భూములను కలుపుకొని ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని.. తమకు న్యాయం చేయాలని శుక్రవారం గ్రామస్తులు బీఆర్ఎస్ నాయకుడు రాములు నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే సబితారెడ్డిని కోరారు. ఇందుకు స్పందించిన ఆమె ఫోన్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతుల భూమి సర్వే చేసి వారికి న్యాయం చేసిన తర్వాతనే ఫెన్సింగ్ వేసుకోవాలని సూచించారు. అందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు యాదవ సంఘం కృతజ్ఞతలు

మీర్‌పేట: మీర్‌పేట మంత్రాల చెరువు వద్ద కామధేను సహిత శ్రీకృష్ణ భగవాన్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించిన సందర్భంగా మీర్‌పేట, జిల్లెలగూడకు చెందిన యాదవ కులస్తులు శుక్రవారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం ప్రతినిధులంతా కలిసి చెరువు వద్ద శ్రీకృష్ణ భగవాన్ విగ్రహ ఏర్పాటుకు ముందుకు రావడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారని, వీలైనంత త్వరగా విగ్రహ నిర్మాణం పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు మాజీ కార్పొరేటర్ అనిల్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు జెనిగె జంగయ్య యాదవ్, బచ్చనబోయిన కాశీరాం యాదవ్, గోపియాదవ్, వర్థం నాగేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, రాసాల నర్సింగ్‌రావు యాదవ్ తదితరులు ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మహిళా భవనం



మహిళాభవనంలోని షెడ్డులో తాగిన మైకంలో తాగుబోతు



ప్రభుత్వ పాఠశాల, మహిళా భవనం ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం

హస్తినాపురం: ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని హస్తినాపురం డివిజన్ పరిధిలోగల భూపేశ్‌గుప్తానగర్‌కాలనీలోని మహిళా భవనం మందుబాబులకు, గంజాయి బాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మహిళా భవనానికి అనుకుని ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మందుబాబులను చూసి బెంబేలెత్తుతున్నారని.. ఇంత జరిగినా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మహిళా భవనంలోని షెడ్డులో పట్టపగలే మందుతాగుతూ, గంజాయి తాగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. టీకేఆర్ కళాశాలకు వెళ్లే ప్రధానరహదారి పక్కన ప్రతినిత్యం వేలాది మంది తిరిగే ఈ ప్రాంతంలో పట్టపగలే అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ చట్టవ్యిరేక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ఈ ప్రాంతంలో మదుబాబుల ఆగడాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పరిహారం.. పరిహాసం!



నక్కర్తమేడిపల్లిలో ఫార్మా పరిహారం పొందిన అసైన్డ్ భూమి

నకిలీలపై నిఘా..

- ఏరివేతకు అధికార యంత్రాంగం సిద్ధం
- స్థానికుల సహకారంతో తుది పరిశీలన
- ఫార్మా పరిహారం పొందిన వారి భూ కబ్జా సర్వే
- అనర్హులని తేలితే ప్లాట్ల రిజిస్ట్రేషన్ల నిలుపుదల

యాచారం: ఫార్మాలో నకిలీల ఏరివేతకు అధికార యంత్రాంగం సిద్ధమయింది. దీంతో పరిహారం అందింది. ప్లాట్ల నంబర్లు వచ్చాయి. కబ్జాలు చూశామని ఆశల పల్లకీలో ఉన్నవారికి గుండెల్లో రైలు పరుగెడుతున్నాయి. ఫార్మా భూ సేకరణలో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించి, వందల ఎకరాలకు వందల కోట్ల రూపాయల పరిహారాన్ని ఫలహారంగా అనర్హులకు పంచిపెట్టారని, ప్లాట్లు ఇచ్చారన్న ఆరోపణల నేపథ్యంలో తుది పరిశీలనకు రంగం సిద్ధమైంది.

కొనసాగుతున్న సర్వే

ఫార్మాసిటీకి యాచారం మండలం నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో సుమారు 4 వేల మంది రైతుల నుంచి పది వేల ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూమిని ప్రభుత్వం సేకరించింది. ఆ భూమికి రెండు నెలల క్రితం బౌండరీకి సర్వే, ఫెన్సింగ్ పనులను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. తాజాగా పరిహారం పొందిన రైతుల కబ్జాను సర్వేకు శ్రీకారం చుట్టింది. జాబితా వారీగా ఒక్కో సర్వే నంబరులో ఎంత భూమి ఉంది. ఎన్ని ఎకరాలకు పరిహారం ఇచ్చాం. ఏ రైతు పేరిట పరిహారం అందింది. కోర్టు కేసులో ఎన్ని ఎకరాల భూమి ఉందనే వివరాలను సర్వే ద్వారా గుర్తించనుంది. ఆయా సర్వే నంబర్లలో నకిలీలు ఏమైనా పరిహారం పొందారా.. పొందితే ఏ విధంగా తీసుకున్నారు. వారికి నివేదికలు తయారు చేసిన అధికారులేవరు? అనే వివరాలపై ఆరా తీయనున్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి పర్యవేక్షణలో.. పరిహారం పొందిన రైతుల కబ్జా సర్వే రెండు రోజులుగా సాగుతోంది. భూసేకరణ, నకిలీలకు పరిహారం అందజేతపై అభ్యంతరాలుంటే ఫిర్యాదు చేయాలని ఆర్డీఓ రైతులకు సూచిస్తున్నారు.

అధికారుల అండతో..

ఫార్మాసిటీ భూసేకరణ ప్రారంభంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం.. పట్టా భూముల రైతులకు పట్టాదారు, పాసుపుస్తకాల్లో ఉన్న ఎకరాలకు మొత్తం పరిహారం (ఎకరాకు రూ.12 లక్షలు) ఇవ్వగా, అదే అసైన్డ్ పట్టాదారులకు సాగు యోగ్యంగా ఉన్న భూమికి (ఎకరాకు రూ.8 లక్షలు) మాత్రమే ఇచ్చింది. ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్న రైతులకు (రూ.7.70 లక్షలు) అందజేసింది. అసైన్డ్ దారులకు సాగు యోగ్యమైన భూమికి మాత్రమే పరిహారం ఇవ్వడంతో నకిలీలకు అవకాశం చిక్కింది. అధికారుల అండదండలతో పరిహారంలో సగ భాగం చొప్పున వందలాది ఎకరాలకు రూ.కోట్లు నష్ట పరిహారం దండుకున్నారు. నాలుగు గ్రామాల్లోనే సుమారు 500 ఎకరాలకు పైగానే నకిలీలు పరిహారం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో ఓ ఆర్డీఓ పని చేసిన రోజుల్లోనే నకిలీలుగా పేర్కొంటున్న వారంతా భారీ మొత్తంలో పరిహారం పొందారనే ఫిర్యాదులు అందాయి. దీంతో నకిలీల ఎరివేత స్కానింగ్‌లో కబ్జాల వారీగా గుర్తించేందుకు స్థానికుల సహకారాన్ని అధికారులు తీసుకుంటున్నారు.

పరిహారం రికవరీ.. అర్హులకు అందజేత



కబ్జాలో ఉన్న రైతుల వివరాలను గుర్తిస్తున్న అధికారులు

ఫార్మా నకిలీల ఎరివేతకు ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో అధికార యంత్రాంగం తుది పరిశీలనకు సిద్ధమైంది. ఆ నాలుగు గ్రామాల్లోని సుమారు 3,900 మందికి పైగా రైతులకు ఫార్మా సర్టిఫికెట్లు అందజేశారు. లాటరీల్లో వారి పేర్లను కూడ ప్రకటించారు. (కోర్టు కేసు ఉన్న పట్టా రైతులు కొందరు సర్టిఫికెట్లు తీసుకోలేదు) మీరాఖాన్‌పేటలోని టీజీఐఐసీ మెగా వెంచర్‌లో ప్లాట్ల నంబర్ల వారీగా కబ్జాలను చూపించారు. నంబర్ల వారీగా రిజిస్ట్రేషన్లు చేశారు. కానీ ఏ రైతుకు రిజిస్ట్రేషన్ల డాక్యుమెంట్లు ఇవ్వలేదు. తాజాగా పరిహారం పొందిన రైతుల భూ ఎకరాలు, కబ్జాలు సర్వే చేస్తున్న అధికారులు సర్వేలో నకిలీలు అని తేలితే, వారి పేరిట ఉన్న రిజిస్ట్రేషన్ల డాక్యుమెంట్లను నిలుపుదల చేస్తారు. నకిలీల నుంచి పరిహారం రికవరీ చేయడంతో పాటు నిజమైన రైతులకు పరిహారం, ప్లాట్లు దక్కేలా చూడనున్నారు. నకిలీల జాబితా అధికారుల వద్ద ఉన్నట్లు సమాచారం.

మా భూమిపై మరొకరికి పరిహారం



గ్రామంలోని సర్వే నంబరు 184లో నా భర్త లిక్కి కృష్ణ రెడ్డి పేరిట అసైన్డ్ పట్టా 5 ఎకరాల భూమి ఉంది. ఫార్మా భూ సేకరణలో మా భూమి పేరిట మరొకరు పరిహారం పొందారు. కనీస సమాచారం కూడా లేదు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశాము. అయినా స్పందన లేదు. పరిహారం కోసం ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తా.

– లిక్కి నిర్మలమ్మ, మహిళా రైతు, నక్కర్తమేడిపల్లి

అభ్యంతరాలుంటే తెలపండి



ఫార్మాసిటీ భూసేకరణపై పరిహారం పొందిన రైతుల వివరాలు, ఎకరాలపై కబ్జా సర్వే చేస్తున్నాం. కొన్ని సర్వే నంబర్లలో రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మౌఖికంగా కాకుండా.. లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయండి. వాటి ఆధారంగా సర్వే చేసి, అర్హులై ఉంటే.. పరిహారం రికవరీతో పాటు ప్లాట్లను కూడా వారి పేరిట జారీ చేస్తాం. అందుకే ప్లాట్ల రిజిస్ట్రేషన్లను ఆపేశాం.

– అయ్యప్ప, తహసీల్దార్, యాచారం